నేడు రైతు దీక్ష

బండ్లగూడ, జనవరి 16: రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో రైతులకు మద్దతుగా నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగే రైతు దీక్షకు తరలిరావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను వివరించి వారి తరుపున దీక్ష చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ప్రతి కార్యకర్త తమ వంతు కర్తవ్యంగా రావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,జనవరి 16: విద్యుత్ కేబుళ్ల మరమ్మతు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శుక్రవారం బంజారాహిల్స్ సబ్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సబ్ స్టేషన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2, షాంగ్రిల్లా ప్లాజా, సాగర్ సొసైటీ, ఐడీబీఐ, చల్లా ఐ కేర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరా ఉండదు. ఎల్వీ ప్రసాద్ సబ్ హాస్పిటల్ సబ్ స్టేషన్ పరిధిలోని జింఖానా క్లబ్, కేబీఆర్ పార్కు, క్రీమ్‌స్టోన్, వరుణ్ మోటర్స్, ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల దాకా సరఫరా ఉండదని బంజారాహిల్స్ ఏడీఈ గోపీ తెలిపారు.

వ్యాపారి ఇంట్లో నగదు మాయం

బంజారాహిల్స్, జనవరి 16: యజమాని ఇంట్లో నగదు చోరీ చేసిన పనిమనిషిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లో నివాసం ఉంటున్న నితిన్ సింఘానియా అనే వ్యాపారి ఇంట్లో ఈనెల 13న టేబుల్ మీద పెట్టిన రూ.93 వేల నగదు మాయమయ్యాయి. ఇంట్లో ఉన్న వారందరినీ వాకబు చేయగా తమకు తెలియదని తెలిపారు. తమ ఇంట్లో పనిచేస్తున్న శారద అనే పనిమనిషి మీద అనుమానం వ్యక్తం చేస్తూ నితిన్ సింఘానియా గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాధ్యతగా హెల్మెట్ ధరిద్దాం

- హెల్మెట్‌తోనే ప్రయాణికులకు భద్రత ఏసీపీలు సంపత్‌కుమార్, శంకర్ రాజు
- రహదారులపై వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు
- ధరించిన వారికి గులాబీలు అందజేసి అభినందనలు తెలిపిన సిబ్బంది

తిరుమలగిరి చౌరస్తాలో హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పం అందజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబు

హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వు ఇచ్చి అభినందిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

అడ్డగుట్ట, జనవరి 16: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మెట్టుగూడ ఆలుగడ్డ బావి సిగ్నల్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆయన గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న వాహనదారులకు ఏసీపీ సంపత్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. రోడ్డుపై జరిగే ప్రమాదాలకు ముఖ్యకారణం ర్యాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యమేనని ఆయన తెలిపారు. అందుకే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ సమీపంలో

అమీర్‌పేట్‌లో ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు...

అమీర్‌పేట్: రహదారులపై పయనిస్తున్న సమయంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. జాతీయ రమదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించిన సందర్భంగా, ట్రాఫిక్ నిబంధనలను పూర్తి స్థాయిలో పాటిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి పూలను అందిస్తూ అభినందించారు. పలువురు ద్విచక్ర వాహనదారులు నిబంధనల మేరకు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్‌ను ధరిస్తుండడం అభినందనీయమన్నారు. రహదారులపై వాహనదారుల భద్రత కోసమే నిబంధనల రూపకల్పన జరిగిందని చెబుతూ, వాహనదారులు పూర్తి స్థాయిలో సురక్షితమైన పద్ధతుల్లో ప్రయాణాలు సాగించాలన్నదే ట్రాఫిక్ విభాగం ఉద్దేశమన్నారు. ప్రతిఒక్కరు నిబంధనల మేరకు వాహనాలు నడిపితే ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టగలవన్నారు.

భద్రత కోసం విధిగా హెల్మెట్ ధరించాలి

బొల్లారం: రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం తిరుమలగిరి చౌరస్తాలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబుతో కలిసి వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన నిర్వహించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ తమ వ్యక్తిగత భద్రత కోసం హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతిఏటా సగుటన 44శాతం మంది ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సైలు రెడ్డి నాయక్, జయలలిత, పద్మ, హెడ్ కానిస్టేబుల్ దీను ప్రకాష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నింబధనలు పాటించాలి

చిక్కడపల్లి, జనవరి 16: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసంలో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో అరోరా కాలేజీ విదాయర్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి వాహనాదారులకు హెల్మెట్ ప్రముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వులు, చాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 16: అమీర్‌పేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకలు మచ్చ వేణుగోపాల్‌గౌడ్ తండి రాములుగౌడ్ (86) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ రాములుగౌడ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నామాన సంతోష్ మణికుమార్, కూతురు నర్సింహ, అశోక్‌యాదవ్, కట్టా బలరామ్, సుమిత్‌సింగ్ బాబా, శ్రీనివాస్ గౌడ్, జితేందర్ శుక్లా తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బన్సీలాల్‌పేట్: కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్‌కు చెందిన సీనియర్ నాయకుడు కేవీ కమల్‌కుమార్ ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. చికిత్స అనంతరం గురువారం ఆయన మారెడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని కలిసారు. ఈ సందర్భంగా కమల్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని తలసాని అన్నారు. వారి ఏ కష్టం వచ్చినా తాను సోదరుడిగా అండగా ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కె.లక్ష్మిపతి, సురేశ్, వినోద్, ముక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పేరును చెరిపేసే కుట్ర

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, జనవరి 16: రాజకీయ కక్షసాధింపును చర్యలు నిలిపివేసి పాలనపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు సూచించారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి లేనిపోని అపోహలు సృష్టించి బీఆర్ఎస్ పేరును చెరిపేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 13నెలలు అవుతున్నా పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకొనే పరిస్థితి లేదని విమర్శించారు. గురువారం భోలక్‌పూర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమైనవో చెప్పకుండా సోషల్ మీడియా, మీడియాలో లేనిపోని లీకులు ఇచ్చి బీఆర్ఎస్ క్యాడర్‌ను భయభ్రాంతుల్ని చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను ఏరకంగా ఇబ్బందులు పెట్టాలే, ఎట్లా అరెస్టు చేయాలనే ఆలోచన తప్ప పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రశ్నించే వారిని అరెస్టులు చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకోవాలని చూస్తుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆపి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.

లక్ష డప్పులు-వేల గొంతుల ప్రదర్శనకు తరలిరావాలి

బొల్లారం, జనవరి 16: ఫిబ్రవరి 7న నగరంలో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల మహా ప్రదర్శనకు బీసీ కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు లక్షలాదిగా తరలిరావాలని ప్రముఖ కవి, గాయకుడు దరువు అంజన్న పిలుపునిచ్చారు. కంటోన్మెంట్‌లోని డ్రీమ్‌లాండ్ గార్డెన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకొని అధికారికంగా అమలు చేయాలని కోరారు. మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చాలా గొప్పదని కొనియాడారు. అనంతరం ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు మోహన్ బైరాగి మాట్లాడుతూ సుప్రీంకోర్టు సైతం వర్గీకరణ అమలు చేయాలని కోరిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అధికారికంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇటిక శ్రీకిషన్‌మాదిగ, మల్లికార్జున్‌మాదిగ, అజిత్ కళ్యాన్, మంద మధుకర్, బాబేందర్, మురళి, నరేశ్, మధు, ప్రవీణ్, తాండ్ర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ గాయకుడు దరువు అంజన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు

రోగాన్ని సైతం నయం చేసే కళ సంగీతం



కార్యక్రమంలో వెకంట్ గరికపాటి

చిక్కడపల్లి, జనవరి 16: ప్రాణం లేని రాయిని సైతం కరిగించి, మనిషి రోగాన్ని సైతం నయం చేసే కళ సంగీతమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి అన్నారు. శ్రీరామ సంస్కృతిక సేవ సంస్థ, నాద వినోద సంగీత అకాడమీ (యూఎస్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో మణిశాస్త్రి సమర్పణలో సినీనటి జయప్రద 50 ఏండ్ల సినీ ప్రస్థానం సందర్భంగా స్వర్ణత్సోవ కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా హాజరైన వెంకట్ గరికపాటి మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన మణిశాస్త్రికి 'మధురగాన తేజో ద్వీమణి' బిరుదును అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సమావేశంలో సంగీత దర్శకుడు, లిటిల్ మ్యూజియన్ అకాడమీ వ్యవస్థాపకుడు కొమండూరి రామాచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ చానల్ ఈదిన విక్టోరియకు సత్కారం

క్వీన్ విక్టోరియాను సన్మానిస్తున్న క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, తదితరులు

చిక్కడపల్లి,జనవరి 16 ఇంగ్లిష్ చానల్ ఈదిన తొలి తెలుగు మహిళా గంధం క్వీన్ విక్టోరియాను వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదారబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, సభ్యులు గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో ఘనంగా సన్మానించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తొలి తెలుగు మహిళా ఇంగ్లిష్ చానల్ ఈది దేశఖ్యాతిని పెంచిన విక్టోరియాకు అభినందనలు తెలిపారు. సుమారు 17 గంటల్లో 77 కిలోమీటర్ల పాటు స్విమ్మింగ్ చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రంలో క్లబ్ కార్యదర్శి సైకం మనోహర్‌రెడ్డి, కోశాధికారి దశరథ్, క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ నాగభూషణం, మాజీ రీజనల్ కౌన్సిలర్ మురళీకృష్ణ, క్లమ్ మాజీ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శైలాజమోహన్, రాజశేఖర్, స్కైలాబ్ బాబు, పద్మగౌడ్, వెంకట్ స్వామిగౌడ్, సత్యనారాయణ, రాఘురాం రెడ్డి, జీవన్, ఆదిత్య, వీరయ్య, మానిక్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ గురువారం మధ్యాహ్నం మైసమ్మ, పోచమ్మ ఆలయంలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సాధం బాల్‌రాజ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బీనవేనీ మల్లేశ్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు గంగుల మధుయాదవ్, ఉపాధ్యక్షుడు కత్తెర శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నాగరాజ్ యాదవ్, దేవేందర్‌యాదవ్, శ్రీపతి సత్యనారాయణయాదవ్, రాజ్యం శ్రీశైలంయాదవ్, సిద్ధుయాదవ్, రాజుయాదవ్, కన్నబాయిన సత్యనారాయణయాదవ్, బొడ్డు మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

– సికింద్రాబాద్, జనవరి 16:

వేర్వేరు రైళ్లల్లో దొంగతనాలు

కాచిగూడ, జనవరి 16: కొంగు రైల్లో బంగారు ఆభరణాలు, దుబాయ్ కరెన్సీని దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. భూపాల్‌కు చెందిన ఉన్నీసా కొంగు రైల్లో కాచిగూడకు వస్తుండగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో బ్యాగును చూసుకునేసరికి అందులో 152 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7 వేల దుబాయ్ కరెన్సీ ఉన్నట్లు. గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

కాచిగూడ సూపర్‌ఫాస్ట్ రైల్లో..

కాచిగూడ సూపర్‌ఫాస్ట్ రైల్లో ప్రయాణికురాలి నగదు, ఫోన్‌లను దొంగిలించారు. కాచిగూడరైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప ప్రకారం భోపాల్‌కు చెంది శ్రద్ధాగుప్తా కాచిగూడ సూపర్‌ఫాస్ట్ రైల్లో కాచిగూడకు వస్తుండగా ముత్‌కేడ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో రూ.45 వేలు, ఖరీదైన ఫోన్ ఉన్నట్లు తెలిపారు. గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని నాంధేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

అజంతా రైల్లో..

అజంతా రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు, ఫోన్‌లను దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన జ్యోతి అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా ధర్మాబాద్ రైల్వేస్టేషన్ సమీపం లో ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో 2 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 వేలు, ఫోన్ ఉన్నట్లు తెలిపారు. గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

అకోలా రైల్లో..

అకోలా రైల్లో ప్రయాణికుని ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఉసామా షాన్‌వాజ్‌ఖాన్ అకోలా రైల్లో కాచిగూడకు వ స్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో ఖరీదైన ల్యాప్‌ట్యాప్ ఉన్నట్లు తెలిపారు. డిసెంబర్ 21వ తేదీన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని కాచిగూడ రైల్వేస్టేషన్‌కు బదిలీ చేయగా గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ రైల్వే సీఐ తెలిపారు.

పీఓడబ్ల్యూ ఐక్యతా సభకు తరలిరండి

పీఓడబ్ల్యూ ఐకత్యా సభకు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం జాతీయ నాయకురాలు వి.సంధ్య, జి.ఝాన్సీ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 16: ఈనెల 24న మంచిర్యాలలో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఐక్యతా సభను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య, జి.ఝాన్సీ పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో సభ వాల్ పోస్టర్‌ను పలువురు మహిళా నేతలతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహిళా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమనత్వం లక్ష్యంగా అభ్యుదయ మహిళా సంఘాన్ని 1974లో స్థాపించామని తెలిపారు. మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత మహిళా ఉద్యమాల నిర్మాణమే మహిళా సంఘాల ప్రధాన కర్తవ్యంగా ముందుకు వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాల ఐక్యతా సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకురాలు వై.గీత, పద్మ, భారతి, ప్రేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్, జనవరి 16: అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్‌లోని కరౌలి జిల్లా ఖేరియా ప్రాంతానికి చెందిన మోను కోలి (26) అనే యువకుడు మార్బుల్ వర్క్ చేస్తూ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కైలాష్ చంద్ అనే వ్యక్తికి స్నేహితుడిగా ఉన్నాడు. కాగా బుధవారం ఉదయం కైలాష్ చంద్ తన గదికి తాళం వేసి పనికెళ్లి రాత్రి ఇంటికి తిరిగొచ్చేసరికి తన గది తాళం పగలగొట్టబడి కనిపించింది. లోపలినుంచి గడియ పెట్టుకుని ఉండడంతో తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా స్నేహితుడు మోనూ కోలి తాడుతో ఉరేసుకుని కనిపించాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బీఎన్ఎస్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందజేస్తాం

కవాడిగూడలో రేషన్‌కార్డు దరఖాస్తులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్, కిరణ్మయి

కవాడిగూడ, జనవరి 16: ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైవారికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముషీరాబాద్ మండల తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ తెలిపారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు సివిల్ సప్లై అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. పౌరసరఫరా శాఖ అధికారి కిరణ్మయి ఆధ్వర్యంలో కవాడిగూడలో నిర్వహించిన ఇంటింటి వెరిఫికేషన్‌ను ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, రెవెన్యూ అధికారి పద్మ పర్యవేక్షించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ లిస్టులో పేరు రాలేదని ఎవరూ ఆందోళనకు గురికావద్దని ఈసేవ, ప్రజాభవన్‌లో మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ అశోక్‌రెడ్డి, సివిల్ సప్లై సిబ్బంది పాల్గన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శంషాబాద్ రూరల్, జనవరి 16: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ తెలిపారు. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని గండిగూడలో నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

కరినోము ఉత్సవాలు

అన్న ప్రసాద వితరణలో జి.శ్రీనాథ్‌గౌడ్ దంపతులు, ఈవో అన్నపూర్ణ

చిక్కడపల్లి, జనవరి 16: చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కరినోము ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశీయుడు రాజేంద్ర నాథ్ గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్ దంపతులు, కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

యాప్రాల్‌లో అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

జవహర్‌నగర్, జనవరి 16: యాప్రాల్‌లో గురువారం అనారోగ్యంతో యాచకురాలు మృతిచెంచింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాప్రాల్ ప్రాంతంలో వృద్ధురాలైన చెన్నమ్మ (65) బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నది. కాగా ఆమెకు అదే ప్రాంతంలో నివసిస్తూ ఇళ్లల్లో పని చేసే బక్కమ్మతో పరిచయం ఏర్పడింది. బక్కమ్మ కిరాయి ఇం ట్లోనే ఇద్దరూ కలిసి ఉండేవారు. చెన్నమ్మ తాగుడుకు బానిస కావడంతో బక్కమ్మ మందలించగా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈనెల 10న పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న బక్కమ్మకు యాప్రాల్‌లో అచేతన స్థితిలో చెన్నమ్మ కనిపించడంతో తన ఇంటికి తీసుకెళ్లింది. ఈనెల 13న బక్కమ్మ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేలోగా చెన్నమ్మ స్పృహ లేకుండా పడి కనిపించింది. వెంటనే 108కు ఫోన్ చేయగా సిబ్బంది చేరుకుని పరిశీలించారు. అప్పటికే చెన్నమ్మ మృతి చెందినట్లు తెలిపారు. బక్కమ్మ జవ హర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.